నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

బోరబండ సబ్‌స్టేషన్ పరిధిలో..

ఎర్రగడ్డ, మార్చి 7: బోరబండ సబ్‌స్టేషన్ పరిధిలోని స్వరాజ్‌నగర్, సైట్-2 కాలనీ, సాయిబాబా నగర్, పద్మావతి నగర్, అల్లాపూర్, బంజారా నగర్ తదితర ప్రాంతాల్లో శనివారం మధ్యాహ్నం 2 నుంచి 3 గంటల వరకు విద్యుత్ సరఫరాను నిలిపి వేస్తున్నట్లు అసిస్టెంట్ డివిజనల్ ఇంజినీర్ చరణ్ సింగ్ శుక్రవాం ఓ ప్రకటనలో పేర్కొన్నారు.

నేడు వేంకటేశ్వరస్వామి కల్యాణోత్సవం

శంషాబాద్ రూరల్ : నేడు వేంకటేశ్వర స్వామి కల్యాణోత్సవం నిర్వహిస్తున్నట్లు జాతర నిర్వాహకులు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. శంషాబాద్ మండలంలోని రామంజాపూర్ గ్రామంలో ఉన్న శ్రీ వేంకటేశ్వర స్వామి జాతర ఉత్సవాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. జాతర ఉత్సవాలలో భాగంగా శనివారం స్వామి వారి కల్యాణం నిర్వహించడం తో ఉత్సవాలు ముగుస్తాయని వివరించారు. ఉదయం 11.16 నిమిషాలకు నిర్వహించే జాతరకు భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి

గుడ్ మార్నింగ్ మణికొండ ప్రజాభిప్రాయ సేకరణలో మణికొండ బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు సీతారాం దూళిపాల

మణికొండ మార్చి 7: 'గుడ్ మార్నింగ్ మణికొండ' పేరుతో నిర్వహిస్తున్న కార్యక్మంలో ప్రజల సమస్యలను తెలుసుకుంటున్నారు.దానిలో భాగంగా శుక్రవారం భారత రాష్ట్ర సమితి మణికొండ పార్టీ నాయకులు సాయి గౌతమ్ నగర్, పుప్పాలగూడ ప్రాంతంలో తిరిగి స్థానిక సమస్యలపై ప్రజాభిప్రాయ సేకరణ చేపట్టారు.

మణికొండ మున్సిపాలిటీలో గుడ్ మార్నింగ్ మణికొండ పేరుతో చేపట్టిన ప్రజాభిప్రాయ సేకరణలో భాగంగా స్థానికుల సమస్యలు తెలుసుకుంటున్న బీఆర్ఎస్ నాయకులు

- ముష్కిం చెరువు చుట్టూ పెద్ద పెద్ద కాంప్లెక్స్ కడుతున్నారని దీంతో వాటి డ్రైనేజీ మొత్తంగా చెరువులో కలుపుతున్నారని తెలిపారు. చెరువు స్థలం ఇప్పటికే కొంత మేర అన్యాక్రాంతం అయిందని అందువలన వెంటనే సంబంధిత అధికారులు స్పందించి డ్రోన్ సర్వే చేసి ఫుల్ ట్యాంక్ లెవెల్‌తో పాటు బఫర్‌జోన్‌లను కాపాడుతూ చుట్టూ ఫెన్సింగ్ ఏర్పాటు చేయాలని వారు కోరారు.
- చెరువు మొత్తం చెత్తా చెదారంతో నిండి ఉన్న కారణంగా దోమల బెడదతో ప్రజలందరూ అనారోగ్యం పాలవుతున్నారని అందుకు గాను దోమల పెరుగుదల నివారణకు డ్రోన్ ద్వారా పిచికారీ కొట్టాలని ప్రజలు విజ్ఞప్తి చేశారు.
- ముష్కిం చెరువు పరిసర ప్రాంతాలలో లెక్కకు మించి బోరింగ్‌లు వేసి భూగర్భ జలాలు అడుగంటి పోయే విధముగా నీటిని తోడి రాత్రీపగలు తేడాలేకుండా నీటి ట్యాంకర్ల ద్వారా నీటిని అమ్ముతున్నారు.
- ముష్కిం చెరువు పక్కన ఉన్న ఖాళీ స్థలంలో రాత్రి కాగానే కొంతమంది అసాంఘిక కార్యకలాపాలు నిర్వహిస్తున్నారని కాలనీవాసులు వాపోయారు.
- బీఆర్సీ నుంచి మై హోమ్ అవతార్ వరకు అసంపూర్తిగా ఉన్న రహదారిని వెంటనే పూర్తి చేయాలని స్థానికులు బీఆర్ఎస్ నాయకుల దృష్టికి తీసుకెళ్లారు.
- చెరువు ఆక్రమణకు గురికాకుండా, అసాంఘిక కార్యకలాపాలు నిర్వహిస్తున్న వారిపై, అక్రమ నీటి సరఫరా దారులపై సంబంధిత అధికారులు స్పందించి తగిన నివారణ చర్యలు వెంటనే చేపట్టాలని బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు సీతారాం దూళిపాళ్ల డిమాండ్ చేశారు. ఈ ప్రజాభిప్రాయ సేకరణ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు గుట్టమీది నరేందర్, ఉపేంద రన్నాథ్‌రెడ్డి,గోరికంటి విఠల్, సంఘం శ్రీకాంత్, బండమీది మల్లేష్, మాల్యాద్రి నాయుడు, షేక్ ఆరీఫ్, దిలీప్, కందట ప్రవీణ్, సుమనళిని, భాను చందర్, మహేందర్, బొడ్డు శ్రీధర్, రమణ మూర్తి, తిరుపతి, రాజేంద్ర ప్రసాద్, యాలల కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి సమస్యలు పరిష్కరించాలి

మణికొండ: వేసవికాలం ముంచుకొస్తున్న తరుణంలో తాగునీటి సమస్యలు రోజురోజుకు తీవ్రమవుతున్నాయని అధికారులు తక్షణమే చర్యలు చేపట్టి ప్రజల దాహార్తిని తీర్చాలని మణికొండ మున్సిపాలిటీ మాజీ వైస్ చైర్మన్ కే.నరేందర్ రెడ్డి జలమండలి అధికారులను కోరారు. శుక్రవారం మణికొండ మున్సిపాలిటీలోని జలమండలి కార్యాలయంలో ఉన్నతాధికారులను కలిసి సమస్యలను విన్నవించారు. క్రమం తప్పించి క్రమం నీటి సరఫరా అన్ని కాలనీలలో జరిగే విధంగా చర్యలు చేపట్టాలని ఆయన అధికారులను కోరారు. స్పందించిన జలమండలి డీజీఎం మహేందర్ నాయక్ మాట్లాడుతూ ప్రజలు ఎదుర్కొన్న సమస్యలపై తక్షణమే చర్యలు తీసుకుంటామని ఎక్కడ నీటి సరఫరాలో అంతరాయం లేకుండా చర్యలు చేపడతామని హామీ ఇచ్చినట్లు మాజీ వైస్ చైర్మన్ నరేందర్ రెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర బీజేపీ కార్యవర్గ సభ్యులు టి అంజన్ కుమార్ గౌడ్, మణికొండ మున్సిపాలిటీ బీజేపీ అధ్యక్షుడు సి బీరప్ప, మాజీ కో -ఆప్షన్ సభ్యులు జే సిద్ధప్ప, పార్టీ నాయకులు ఈ. నర్సింగ్ రావు, బి. రవి కాంత్ రెడ్డి, నర్సింగ్‌రావు, ఆనందరావు, పి. ఒదేలు, కాలనీవాసులు పాల్గొన్నారు.

రూ.26 వేలు అమలు చేయాలి

హిమాయత్ నగర్ , మార్చి7: రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వ దవాఖానలో పనిచేస్తున్న శానిటేషన్, పేషెంట్ కేర్ ,సెక్యూరిటీ కార్మికులకు కనీస వేతనం రూ.26 వేలు అమలు చేయాలని తెలంగాణ మెడికల్ కాంట్రాక్ట్ ఎంప్లాయీస్, వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు ఎండీ. యూసుఫ్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.నరసింహ ప్రభు త్వాన్ని డిమాండ్ చేశారు. శుక్ర వారం హిమాయత్ నగర్ లోని ఏఐటీయూసీ రాష్ట్ర కార్యాలయంలో యూనియన్ నగర సమావేశం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాంట్రాక్టర్లు తమ ఇష్టాను సారంగా వ్యవహరిస్తూ కార్మికులకు తక్కువ వేతనాలు ఇస్తూ శ్రమ దోపిడీ చేస్తున్నారని వారు విమర్శించారు. కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించి,కార్మికుల సంక్షేమం కోసం ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో యూనియన్ రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షురాలు లక్ష్మీబాయి, రాష్ట్ర ఉప ప్రధాన కార్యదర్శి హసీనా బేగం, నాయకురాలు రాజేశ్వరి, మంజుల, సంపూర్ణ, రేణుక పాల్గొన్నారు.

హిమాయత్‌నగర్‌లోని ఏఐటీయూసీ రాష్ట్ర కార్యాలయంలో జరిగిన సమావేశంలో మాట్లాడుతున్న యూసుఫ్

'బీసీ మహిళలకు సబ్ కోటా పెట్టాలి'

ఖైరతాబాద్, మార్చి 7: కేంద్ర ప్రభుత్వం మహిళా బిల్లులో బీసీ మహిళలకు సబ్ కోటా పెట్టాలని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు జాజుల శ్రీనివాస్ గౌడ్ అన్నారు. పంజాగుట్ట ఎర్రమంజిల్లోని బీసీ ఉద్యోగుల సంఘం రాష్ట్ర కార్యాలయంలో ఆ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డి. రమా అధ్యక్షతన అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించాఉ. ముఖ్య అతిథిగా హాజరైన శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ.. మహిళల్లో అన్ని సామాజికవర్గాలకు చెందిన వారికి విద్య, ఉద్యోగ, ఆర్థిక, రాజకీయ రంగాల్లో వాటా దక్కినప్పుడే సమన్యాయం జరుగుతుందన్నారు. రమా మాట్లాడుతూ సావిత్రీబాయి పూలే, మదర్ థెరిస్సా స్ఫూర్తితో సమాజ సేవకు పునరంకితం కావాలన్నారు. ఈ సందర్భంగా వివిధ రంగాల్లో ప్రతిభ కనబర్చిన మహళలను సత్కరించారు. ఈ కార్యక్రమంలో బీసీ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు ఎం. చంద్రశేఖర్ గౌడ్, మహిళా నాయకురాలు మంజుల, అనురాధ, విజయలక్ష్మి, స్వాతి, సీతారాములు, శ్రీనివాస్, రవి, రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

ఫిరంగినాలా పూడికతీతతో కూలీలకు ఉపాధి

శంషాబాద్ రూరల్, మార్చి 7 : ఫిరంగినాలీ పూడికతీతతో కూలీలకు ఉపాధి కల్పిస్తామని శంషాబాద్ మండల ఉపాధి హామీ అధికారి అనిత తెలిపారు. శుక్రవారం శంషాబాద్ మండలంలోని కవ్వగూడ గ్రామంలోని ఉపాధి కూలీలతో సమావేశం ఏర్పాటు చేసి వారికి పని కల్పిస్తామని వివరించారు. కవ్వగూడ గ్రామంలోని ఉపాధి కూలీలకు పనిలేకపోవడంతో అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వారికి ఉపాధి కల్పించాలనే లక్ష్యంతో మండలంలోని చౌదర్‌గూడ గ్రామంలో ఫిరంగినాలను పూడికతీత పనులు చేపడుతున్నట్లు వివరించారు. కూలీలు పనులు కల్పించాలనే ఉద్దేశంతో పక్క గ్రామంలో పనులు చేపడుతున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో నర్కూడ పంచాయతీ కార్యదర్శి వజ్రలింగం, ఉపాధి కూలీలు ఉన్నారు.

కవ్వగూడలో ఉపాధి కూలీలతో మాట్లాడుతున్న ఉపాధిహామీ అధికారి అనిత, తదితరులు

క్రికెట్ బెట్టింగ్ నిందితుడు అరెస్ట్

వెంగళరావునగర్, మార్చి 7:దుబాయ్‌లో స్టోర్ క్లర్క్‌గా ఉద్యోగం..ఆ డబ్బు చాలక ఇంకా సంపాదించాలని అడ్డదారి తొక్కాడు ఆ ఎన్.ఆర్.ఐ. సెలవులపై ఇండియాకు వచ్చిన ఆ ప్రవాస భారతీయుడు ఆన్ లైన్‌లో క్రికెట్ బెట్టింగ్‌కు పాల్పడుతూ టాస్క్ ఫోర్స్ పోలీసులకు చిక్కి కటకటాలపాలయ్యాడు. మధురానగర్ పోలీసుల కథనం ప్రకారం రహ్మత్‌నగర్ కు చెందిన సాబేర్ (32) దుబాయ్‌లో క్లర్క్‌గా పని చేస్తున్నాడు. దుబాయ్‌లో డబ్బు చాలక ఇంకా సంపాదించాలనే అత్యాశతో మొబైల్ ఫోన్ ద్వారా క్రికెట్ బెట్టింగ్ ఆడేవాడు . సెలవుపై ఇండియాకు వచ్చి రహ్మత్ నగర్‌లో నివాసం ఉంటున్నాడు. గురువారం రహ్మత్ నగర్ చౌరస్తాలో మొబైల్ ఫోన్‌లో ఆన్ లైన్ క్రికెట్ బెట్టింగ్ చేస్తుండగా వెస్ట్ జోన్ టాస్క్ ఫోర్స్ పోలీసులు పట్టుకున్నారు. కేసు తదుపరి దర్యాప్తు కోసం మధురానగర్ పోలీసులకు అప్పగించారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ఫొటోలను మార్ఫింగ్ చేసి..

వెంగళరావునగర్, మార్చి 7:ఆన్ లైన్ క్లాస్ ట్రయల్ చూసి నచ్చితేనే చేరండి అంటూ నమ్మించారు. క్లాసులో ఉండగా కంప్యూటర్ రిమోట్ యాక్సెస్ ద్వారా విద్యార్థిని డాక్యుమెంట్లను సింప్లీలెర్న్ సంస్థ నిర్వాహకులు తీసుకున్నారు. కంప్యూటర్‌లోని ఆమె ఫొటోలను రహస్యంగా కాజేసి..క్లాస్ నచ్చకున్నా డబ్బు రూ.45 వేలు కట్టాల్సిందేనని ఒత్తిడి చేశారు. డబ్బు ఇవ్వకుంటే నీ ఫొటోల్ని మార్ఫింగ్ చేసి నగ్న చిత్రాలుగా మార్చి సోషల్ మీడియాలో పెడతామని బెదిరించారు. దాంతో నివ్వెరపోయిన ఆ బాధితురాలు ఎస్. ఆర్. నగర్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. పోలీసుల కథనం ప్రకారం ఎస్.ఆర్.నగర్ లోని లేడీస్ హాస్టల్లో నివాసం ఉండే ఓ మహిళ (42) ఎస్. ఆర్. నగర్‌లోని యూ.ఎస్. బేస్ట్ కంపెనీలో హెచ్‌ఆర్‌గా ఉద్యోగం చేస్తుంటారు. గతేడాది సెప్టెంబర్ 28న బిజినెస్ అనలిస్ట్ సర్టిఫికేషన్ కోర్సు కోసం బెంగళూరుకు చెందిన సింప్లీలెర్న్ అనే ఈ-లర్నింగ్ సంస్థకు దరఖాస్తు చేసింది. అదేరోజు కోర్సు ట్రయల్ చూసి..నచ్చితేనే జాయిన్ అవ్వాలని..లేనిచో అవసరం లేదని విద్యార్థినిని ఒప్పించి గంట సేపు ఆన్ క్లాస్‌లో ఉంచారు. మహిళకు చెందిన కంప్యూటర్ రిమోట్ యాక్సెస్ తీసుకుని మహిళకు చెందిన డాక్యుమెంట్లను తీసుకొన్నారు. రహస్యంగా ఆమె ఫొటోల్ని కంప్యూటర్ నుంచి సేకరించారు. తనకు క్లాస్ నచ్చలేదని..అడ్మిషన్ క్యాన్సిల్ చేయాలని పలుమార్లు ఈ మెయిల్స్ ద్వారా మహిళ వాళ్లకు తెలిపింది. అడ్మిషన్ క్యాన్సిల్ చేసేదే లేదని. రూ.45 వేలు డబ్బు కట్టాల్సిందేనని ఖరాఖండిగా చెప్పారు. డబ్బు ఇవ్వకుంటే నీ ఫొటోలను మార్ఫింగ్ చేసి నగ్న చిత్రాలుగా మార్చి సోషల్ మీడియాలో పోస్ట్ చేస్తానని విద్యార్థినిని బెదిరించారు. దీంతో ఆ మహిళ గురువారం ఎస్. ఆర్. నగర్ పోలీసులకు ఫిర్యా దు చేశారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

మెకానిక్ దుకాణంలో అగ్ని ప్రమాదం

మైలార్‌దేవ్‌పల్లి, మార్చి 7: ఓ మెకానిక్ షాప్‌లో మంటలు చెలరేగిన ఘటన శుక్రవారం ఉదయం చోటు చేసుకుంది. వివరాల ప్రకారం సిరాజ్ మైలార్‌దేవ్‌పల్లి దుర్గానగర్ ప్రాంతంలో ఓ మెకానిక్ షాప్‌ను నిర్వహిస్తున్నాడు. ఇక్కడ సర్వీసింగ్‌తో పాటు బైక్‌ల రిపేరింగ్‌లను నిర్వహిస్తుంటారు. గురువారం రాత్రి షాపును మూసేసి ఇంటికి వెళ్లిపోయాడు.
ఉదయం 7 గంటల ప్రాంతం లో షాపులో నుంచి ఒక్కసారిగా మంట లు వస్తుండడంతో స్థానికులు గమనించి అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించారు. వారు ఘటనా స్థలానికి చేరుకొని మంటలను అదుపులోకి తీసుకొచ్చారు. కానీ అప్పటికే రెండు బైక్‌లు పూర్తిగా దగ్ధమయ్యాయి. షాట్ సర్క్యూట్ కారణంగా అగ్నిప్రమాదం జరిగి ఉండవచ్చునని అగ్నిమాపక అధికారులు వెల్లడించారు.

మద్యం మత్తులో ఎస్సైపై..

న్యాయవాదుల దాడి

ఖైరతాబాద్, మార్చి 7: మద్యం మత్తులో డ్యూటీలో ఉన్న ఓ ఎస్సైపై పలువురు న్యాయవాదులు దాడి చేసి కొట్టారు. పంజాగుట్ట పోలీసు స్టేషన్‌పరిధిలో ఈ ఘటన జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.... మధురానగర్ పోలీసు స్టేషన్‌లో ఎస్సైగా పనిచేస్తున్న సి. సాయినాథ్‌రెడ్డి పెట్రో కారులో కానిస్టేబుల్ జి.మహేశ్, హోంగార్డు వెంకటసుబ్బయ్యతో కలిసి పెట్రోలింగ్ నిర్వహిస్తుండగా, ఎల్లారెడ్డి గూడ లా కళాశాల ప్రాంతంలో ఓ ఇంట్లో బ్లూటూత్ సౌండ్ సిస్టం పెట్టి శబ్ద కాలుష్యం చేస్తున్నారని ఫిర్యాదు అందింది. వెంటనే ఎస్సై తన బృందంతో కలిసి అక్కడికి చేరుకొని సౌండ్‌ను తగ్గించాలని ఆ ఇంటి యజమాని న్యాయవాది బి. ధీరజ్‌ను కోరాడు. సౌండ్ తగ్గించేది లేదు... ఏం చేసుకుంటారని ఎదురు ప్రశ్న వేశాడు. ఆ ఇళ్లు ఉన్న ప్రాంతం పంజాగుట్ట పీఎస్ పరిధిలోకి రాగా, వెంటనే ఆ స్టేషన్ పోలీసులకు సమాచారం అందించగా, ఇద్దరు కానిస్టేబుళ్లు అక్కడికి వచ్చి ఇంటి యజమానితో వారించారు. దీంతో కోపోద్రిక్తుడైన ధీరజ్ ఎస్సైపై దాడి చేసి కొట్టాడు. అక్కడే ఉన్న సహచరులైన గణేశ్, అజయ్, రాహుల్ దాడికి సహకరించారు. వారందరూ న్యాయవాదులు కావడం విశేషం. దీంతో ఎస్సై ఫిర్యాదు మేరకు వారిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రాజేంద్రనగర్‌లో ఈవీఎం గోడౌన్ల పరిశీలన

బండ్లగూడ, మార్చి 7: రాజేంద్రనగర్‌లోని ఈవీఎం గోడౌన్‌ను జిల్లా కలెక్టర్ సి.నారాయణ రెడ్డి వివిధ పార్టీల నాయకులతో కలిసి శుక్రవారం పరిశీలించారు. మూడు నెలలకు ఒకసారి జరిగే సాధారణ పరిశీలనలో ఈవీఎం గోడౌన్‌కు వేసిన సీళ్లను పరిశీలించారు.బ్యాలెట్ యూనిట్లు, కంట్రోల్ యూనిట్లు, వీవీ.ప్యాట్లు, ఇతర ఎన్నికల సామగ్రిని భద్రపరిచిన తీరును తనిఖీ చేశారు. ఈవీఎం గోడౌన్ వద్ద పోలీసు బందోబస్తు పరిశీలించారు. ఆయన వెంట రాజేంద్రనగర్ ఆర్డీఓ వెంకట్‌రెడ్డి, ఎన్నికల విభాగం అధికారులు, పలు గుర్తింపుపొందిన రాజకీయ పార్టీ నాయకులు, సంబంధిత అధికారులు ఉన్నారు.

ఈవీఎంల గోడౌనును పరిశీలించిన రంగారెడ్డి జిల్లా కలెక్టర్ సి నారాయణరెడ్డి

సమాజంలో మహిళలదే కీలక పాత్ర

వ్యవసాయ యూనివర్సిటీ: సమాజంలో మహిళలు లేనిదే లోకం లేదని, సామాజిక , రాజకీయ, ఆర్థిక రంగాల్లో తగిన ప్రాధాన్యత ఇవ్వాల్సిన అవసరం ఉందని న్యూఢిల్లీ ఐసీఏఆర్- డీకేఎంఏ ప్రాజెక్టు డైరెక్టర్ డా. అనురాధ అగర్వాల్ అన్నారు. శుక్రవారం హైదరాబాద్ రాజేంద్రనగర్‌లోని నార్మ్‌లో జరిగిన అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకల్లో ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. ప్రస్తుత సమాజంలో మహిళలను ప్రోత్సహిస్తే అన్ని రంగాలలో రాణిస్తున్నారని గుర్తుచేశారు. నార్మ్ జాయింట్ డైరెక్టర్ డా. గోపాల్ లాల్, మహిళా సంక్షేమ కమిటీ చైర్ పర్సన్ డా. బి. నిర్మల సభ్యులు ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు.

సమావేశంలో మాట్లాడుతున్న డీకేఎంఎ పీడీ డా. అనురాధ అగర్వాల్

సమాజాభివృద్ధిలో మహిళల పాత్ర కీలకం

మైలార్‌దేవ్‌పల్లి: సమాజాభివృద్ధిలో మహిళల పాత్ర ఎంతో కీలకమైందని నవయువ యూత్ క్లబ్ అధ్యక్షులు ఏర్వ కుమారస్వామి అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని బాబుల్‌రెడ్డినగర్‌లోని కమ్యూనిటీహాల్‌లో సిద్ధారాల సంతోష్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఆర్పీలు, ఆశవర్కర్లు, ఏఎన్ఎంలు, స్థానిక మహిళలను శాలువాలతో ఘనంగా సన్మానించారు.

మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి

శంషాబాద్ రూరల్: మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని చిన్నగోల్కొండ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల హెచ్ఎం అరుంధతి సూచించారు. శుక్రవారం శంషాబాద్ మండలంలోని చిన్నగోల్కొండ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా హెచ్ఎం అరుంధతి మాట్లాడుతూ మహిళలు అన్ని రంగాల్లో రాణించాలన్నారు. విద్య, వైద్యం, ఉద్యోగం,వ్యాపారంతో రాణించాలని అప్పుడే సమాజంలో మహిళలకు గుర్తింపు వస్తుందన్నారు.

మహిళలకు సమాన హక్కులు కల్పించాలి

హిమాయత్ నగర్: దేశంలోని మహిళలకు సమాన హక్కులు కల్పించడంలో కేంద్ర ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని భారత జాతీయ మహిళా సమాఖ్య జాతీయ ఉపాధ్యక్షురాలు డాక్టర్ కె.రజిని అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా శుక్రవారం హిమాయత్ నగర్ లోని అమృత ఎస్టేట్స్ ఆవరణలో మహిళా సమా ఖ్య పతాకాన్ని ఆమె ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రజిని మాట్లాడుతూ మహిళలకు 33శాతం రిజర్వేషన్ల బిల్లును పార్లమెంట్ లో , రాష్ట్రపతి ఆమోదించినప్పటికీ డీలిమిటేషన్, జనగణన తరువాత అమలు చేస్తామని కేంద్రం హామీ ఇచ్చి బుట్ట దాఖలు చేయడం దుర్మార్గమన్నారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎఫ్ఐ డబ్ల్యూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎన్. జ్యోతి, రాష్ట్ర సహాయ కార్యదర్శి పమీదా , ఉపాధ్యక్షురాలు ఛాయాదేవి, జె. లక్ష్మి, నేతలు హైమావతి, ప్రమీల, గిరిజ, మాధవి, అరుణ, చందన, సుజాత, నర్సమ్మ, మహాలక్ష్మి పాల్గొన్నారు.

మద్యం సేవించి రోగులను తరలిస్తూ..

కేసు నమోదు చేసిన పంజాగుట్ట ట్రాఫిక్ పోలీసులు

ఖైరతాబాద్, మార్చి 7: రోగులను సురక్షితంగా ఆస్పత్రులకు చేర్చాల్సిన అంబులెన్స్ డ్రైవర్ పట్టపగలే మద్యం సేవించి రోడ్డెక్కాడు. పంజాగుట్ట ట్రాఫిక్ పోలీసు స్టేషన్ పరిధిలో ఈ ఘటన జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... సూరారం సాయిబాబా నగర్కు చెందిన మహ్మద్ హాఫీజుద్దీన్ (48) తేజా అంబులెన్స్ సర్వీస్ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. శుక్రవారం సూరారంలోని మల్లారెడ్డి హాస్పిటల్ నుంచి ఓ చిన్నారిని అంబులెన్స్‌లో నిలోఫర్ దవాఖానకు తీసుకెళ్లాడు. కూకట్పల్లి వై జంక్షన్లో ఉన్న ఓ ప్రైవేట్ దవాఖాన నుంచి అంబులెన్స్ కోసం పిలుపురాగా నిలోఫర్ ఆస్పత్రి నుంచి పంజాగుట్ట మీదుగా బయలుదేరాడు. పంజాగుట్ట జంక్షన్లో ట్రాఫిక్ పోలీసులు ప్రత్యేక డ్రైవ్ నిర్వహిస్తున్న క్రమంలో అతడి అంబులెన్స్‌ను ఆపారు. డ్రైవర్ను ప్రశ్నించగా, అతను తడబడడంతో వెంటనే బ్రీత్ అనలైజర్‌తో పరీక్షించగా, 126 పాయింట్లు వచ్చాయి. వెంటనే అంబులెన్స్‌ను సీజ్ చేసి అతడిపై కేసు నమోదు చేశారు.

ఆర్టీసీ డ్రైవర్ కాలర్ పట్టి....

ఆటో డ్రైవర్ వీరంగం

ఖైరతాబాద్, మార్చి 7: ఆర్టీసీ డ్రైవర్‌పై ఓ ఆటో డ్రైవర్ వీరంగం సృష్టించాడు. అతని కాలర్ పట్టుకొని దాడి చేసి కొట్టాడు. ఈ ఘటన పంజాగుట్ట పోలీసు స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.... ఓల్డ్ బోయిన్పల్లి దుబాయి గేట్‌కు చెందిన జగన్నాథం (40) ముషీరాబాద్ డిపో పరిధిలో డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. కోఠి నుంచి పటాన్‌చెరువు వైపునకు పంజాగుట్ట మీదుగా వెళ్తున్నాడు. పంజాగుట్ట మసీదు యూటర్న్ వద్ద ఓ ఆటోకు బస్సు తగిలింది. దీంతో కోపోద్రిక్తుడైన ఆటో డ్రైవర్ బస్సుకు తన వాహనాన్ని అడ్డంగా పెట్టి డ్రైవర్ కాలర్ పట్టుకొని దుర్భాషలాడుతూ దాడి చేసి కొట్టాడు. చుట్టు పక్కల వారు అడ్డుకునేందుకు ప్రయత్నించినా ఆగకుండా పిడిగుద్దులు కురిపించాడు. దీంతో డ్రైవర్ జగన్నాథం పోలీసులకు ఫిర్యాదు చేయగా, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రైల్వే ట్రాక్ల మధ్య మంటలు

రెండు రైల్వే ట్రాకుల మధ్య మంటలు రాజుకున్నాయి. ఖైరతాబాద్ రైల్వే స్టేషన్లో ప్లాట్ ఫారం నంబర్.1, 2 మధ్యలో ఎండిపోయిన మొక్కలు ఒక్కసారిగా అంటుకున్నాయి. పెద్ద ఎత్తున మంటలు, పొగ రావడంతో అప్రమత్తమైన రైల్వే పోలీసులు, సిబ్బంది నీళ్లు చల్లి మంటలను ఆర్పివేశారు. ఆ సమయంలో రైళ్ల రాకపోకలు లేకపోవడంతో ప్రమాదం తప్పింది. - ఖైరతాబాద్

ట్రాన్స్‌జెండర్‌ను

వివస్త్ర చేసి..

ఖైరతాబాద్, మార్చి 7: అడిగిన డబ్బులు ఇవ్వనందుకు ఓ ట్రాన్స్‌జెండర్‌పై మరో ట్రాన్స్‌జెండర్ల సమూహం దాడి చేసింది. వివస్త్రను చేసి ఆమె వద్ద ఉన్న డబ్బులు లాకున్నారు. ఈ ఘటన పంజాగుట్ట పోలీసు స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.... బేగంపేటలోని మినీగ్రీన్ మార్ట్ లేన్లో నివాసం ఉండే శ్రీలీల (20) ట్రాన్స్ జెండర్. కొంత కాలంగా పంజాగుట్ట సిగ్నల్ వద్ద యాచిస్తూ జీవిస్తున్నది. మూడు నెలల క్రితం మాదాపూర్‌కు చెందిన అంకిత నాయుడు అనే ట్రాన్స్ జెండర్‌తో కలిసి నివాసం ఉన్న సమయంలో ఆమె సహచరులైన సిమ్రాన్ మాలిక్తో పాటు పలువురు ట్రాన్స్ జెండర్లు ఆమె యాచించి సంపాదించిన డబ్బులు ఇవ్వాలంటూ మానసికంగా, శారీరకంగా హింసేచేవారు.
అదే క్రమంలో పంజాగుట్ట సిగ్నల్ వద్ద నిలబడి ఉండగా, అంకిత నాయుడు, సిమ్రాన్ మాలిక్ గ్యాంగ్ సభ్యులైన డింపుల్, అశ్విని, సాయి, హంస, చైత్రా, లిల్లీ, సహస్రలు దాడికి దిగారు. ఆమె వద్ద ఉన్న రూ.2,500 గుంజుకోవడంతో పాటు నడి రోడ్డుపై వివస్త్ర చేశారు. చుట్టు పక్కల ఉన్న షాపు యజమానులు పోలీసులకు సమాచారం అందించగా, బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

యువతిని వెంబడిస్తూ ర్యాష్ డ్రైవింగ్

బంజారాహిల్స్: తండ్రితో కలిసి బైక్ మీ ద వెళ్తున్న ఓ యువతిపట్ల అసభ్యంగా ప్రవర్తించడంతో పాటు ర్యాష్ డ్రైవింత్‌తో వారిని బెదిరింపులకు గురిచేసిన మైనర్లపై జూబ్లీహిల్స్ పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. వివరాల్లోకి వెళ్తే.. బండ్లగూడ సమీపంలోని సన్ సిటీ ప్రాంతంలో నివాసం ఉంటున్న మిస్బాహుద్దీన్ అనే వ్యక్తి గత నెల 21న రాత్రి 9.30 ప్రాంతంలో యూసుఫ్‌గూడ పెట్రోల్ బంక్ వద్ద పెట్రోల్ కోసం ఆగా డు. అక్కడకు యాక్టివా బైక్ మీద వచ్చి న ముగ్గురు మైనర్లు నోటికి వచ్చిన బూతులు మాట్లాడుతూ అసభ్యంగా ప్రవర్తిస్తున్నారు. తన బైక్ వెనక సీట్లో కూర్చున్న తన కుమార్తె(19)ను చూస్తూ బూతులు మాట్లాడుతుండడంతో మం దలించగా వారు ముగ్గురూ కలిసి దాడికి యత్నించారు. దీంతో పెట్రోల్ బంక్ సిబ్బంది జోక్యం చేసుకుని గొడవను ఆపారు. పెట్రోల్ బంక్ నుంచి బయలుదేరిన మిస్బాహుద్దీన్ బైక్‌ను వెంబడిస్తూ జూబ్లీహిల్స్ రోడ్ నెం 45 దాకా వచ్చిన మైనర్లు అసభ్యకరమైన మాటలతో పాటు ర్యాష్ డ్రైవింగ్ చేస్తూ యాక్టివా బైక్‌తో ఢీకొట్టేందుకు యత్నించారు. ఈ మేరకు శుక్రవారం బాధితు డు జూబ్లీహిల్స్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. దీంతో పలు సెక్షన్ల కింద కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

"IN THE COURT OF HON'BLE PRINCIPAL SENIOR CIVIL JUDGE RANGA REDDY DISTRICT: AT L.B. NAGAR
O.S.NO. 2310 OF 2019
Between:
Nature Park Welfare Association & another ...Plaintiffs
And
K.Ranga Reddy & others ...Defendants
To,
Sajida Zareen W/o. Shabbir Hussain, Aged 57 yrs, Occ: House wife R/o. Flat no. 206, Ansari Arcade, Pasha Colony, Puppalagudda, R.R. District, TS. (Defendant no.2)
Please take notice that the Plaintiffs have filed Perpetual nInjunction suit vide O.S. No 2310 of 2019, on the file of Hon'ble Principal Senior Civil Judge Ranga Reddy District: at L.B.Nagar against you and others. You are defendant no.2 in the above suit. Hon'ble court directed you to appear on 26-03-2025 at 10.30 AM before the above mentioned Hon'ble Court failing which the matter will be decided exparte by the Hon'ble Court according to Law.
(By Order of the Court)
Sd/- **Jayesh Bhatt**
Sudhir Srivastava
Gyanender
Deepika,
Advocates
Room no. 23, 2nd Floor Bachelors Building, J.N. Road, Mozamjahi Market, Hyderabd-500001.
Ph: 9948254069